సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 1 । జనవరి । 2024

I



అన్నదాన భవనానికి విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి ఐనగడ్డ శ్రీరామరాజు, భాను దంపతులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



సైసై జోడెడ్లా బండి..

రంగంపేట మండలం వడిశలేరు గ్రామ సమీపాన ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు రసవత్తరంగా జరిగాయి. మొత్తం 71 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. IIలో

డెల్టాలకు 12,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 12,100 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

కొత్త బంగారులోకం



కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేలాది రకాల మొక్కలతో ఏర్పాటు చేసిన కూర్పు ఆకట్టుకుంటోంది. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ సానుకూలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ థింక్ పాజిటివ్, స్టే పాజిటివ్ నినాదంతో ఈ కూర్పు ఏర్పాటు చేసినట్లు నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ తెలిపారు. - కడియం

- నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికిన ప్రజలు
- సరికొత్త ఆలోచనలు.. కొంగొత్త ఆశలతో ముందుకు సాగాలని ఆకాంక్ష
- సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామంటున్న అధికారులు
- నవరత్నాలు, ప్రభుత్వ పథకాలకు అత్యంత ప్రాధాన్యం
- ప్రారంభం కానున్న భారీ పరిశ్రమలు
- 2024లో మరింత పురోగతి

సాక్షి, రాజమహేంద్రవరం: గత ఏడాది ఎన్నో మధుర స్మృతులు మిగిల్చింది.. 'తూర్పు'న కొత్త బంగారు లోకాన్ని ఆవిష్కరించింది.. నూతన సంవత్సరంలోనూ మరింత ఆనందం నిండాలని కాంక్షిస్తూ యువత కొత్త ఏడాదికి ఆహ్వానం పలికింది.. జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు యువకులు, ప్రజలు, అధికారులు 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కేరింతలు కొట్టారు. కేక్‌లు కట్ చేశారు.. కూల్ డ్రింక్‌లు పొంగించి ఆనందంగా గడిపారు. డీజేలు పెట్టుకుని స్టెప్పులతో అదరగొట్టారు. ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. పూజలు, ప్రార్థనలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు చేరేలా.. జిల్లా మరింత అభివృద్ధి దిశగా పయనించేలా కృషి చేస్తామని జిల్లా అధికార యంత్రాంగం నూతనోత్సాహంతో చెబుతోంది. రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యమని పోలీసు శాఖ వివరిస్తోంది. మరోవైపు జిల్లాలో ఇప్పటికే పలు కీలక ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. నూతన ఏడాదిలో అవి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

'తూర్పు'... ప్రగతి కూర్పు

ప్రభుత్వ సహకారంతో జిల్లా ప్రగతి పథాన పయనిస్తోంది. 2022లో జిల్లాల పునర్విభజన తర్వాత మరింత అభివృద్ధి సాధ్యమైంది. పారిశ్రామిక రంగాల్లో ఎనలేని పురోగతి సాధిస్తోంది. దిగ్గజ పరిశ్రమలు సైతం జిల్లా వైపు చూస్తున్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే.. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. ఈ కళాశాల నిర్మాణ పనులు 2023లో పూర్తయి భవనాలు అందుబాటులోకి వచ్చాయి. 150 మెడికల్ సీట్లతో 2023–24 విద్యా సంవత్సరంలో కళాశాల ప్రారంభమైంది. అకడమిక్ కార్యకలాపాలకు ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్ అందుబాటులోకి తీసుకొచ్చారు. మిగిలిన హాస్టల్ తదితర భవన నిర్మాణాలు ఈ ఏడాదిలో పూర్తి కానున్నాయి.

- నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఒక్క రాజానగరం మండలం వెలుగుబంద గ్రామంలోనే 284 ఎకరాల్లో 13,069 మంది పేదల ఇళ్లు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది అన్ని ఇళ్లు పూర్తయ్యే అవకాశం ఉంది.
- రైస్‌బౌల్ ఆఫ్ ఇండియాగా పేరొందిన గోదావరి తీరంలో పెట్రో ఉత్పత్తుల్లో కలిపే బియ్యం ఆధారిత తొలి ఇథనాల్ ప్లాంట్ నెలకొల్పారు. గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి వద్ద రూ.260 కోట్ల అంచనాతో ప్లాంట్ ఏర్పాటుకు నాంది పలికారు. పరిశ్రమ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రజలకు అందుబాటులోకి రానుంది. పరిశ్రమ ప్రారంభమైతే 210 మందికి ఉపాధి దక్కుతుంది.
- కొవ్వూరు మండలం పంగిడి వద్ద రూ.1,350 కోట్లతో త్రివేణి రెన్యువబుల్ సంస్థ ఆధ్వర్యంలో సోలార్ గ్లాస్ తయారీ పరిశ్రమ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే 2,400 మందికి ఉపాధి దక్కనుంది.
- రైతుల సాగునీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు రూ.53 కోట్లతో తొర్రిగెడ్డ కాలువ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు పూర్తయితే సాగునీటి బెంగ తీరుతుంది.

అర్హులకు సంక్షేమ ఫలాలు



అర్హులందరికీ 'నవరత్న' పథకాలు అందించేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాం. ఆ ఫలాలు ఇళ్ల వద్దకే చేర్చుతాం. కొత్త జిల్లాకు తొలి కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. అన్నింటా అనుకున్న లక్ష్యాలను సాధించాం. జిల్లాను ప్రగతి పథంలో నడిపించాం. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు రానున్న దృష్ట్యా తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేస్తున్నాం. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేస్తాం. అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తున్నాం. గృహ నిర్మాణం, పరిశ్రమలు, పింఛన్ల పంపిణీ అన్ని పథకాల్లో రాష్ట్రంలో మేటిగా నిలుస్తున్నాం. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

తొలి కర్తవ్యం అదే..



జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే మా ముందున్న ప్రథమ కర్తవ్యం. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నాం. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాం. ప్రజలకు అవగాహన కల్పించి ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా చర్యలు తీసుకుంటాం. దీంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. మహిళలు, బాలల రక్షణపై దృష్టి పెట్టాం. డ్రగ్స్, గంజాయి, అక్రమ మద్యం, సారా నివారణపై ఉక్కుపాదం మోపుతున్నాం. పోలీసులు, ప్రజలకు 'హ్యాపీ న్యూ ఇయర్'. కొత్త సంవత్సరం మరింత సంతోషాలు నింపాలని కోరుకుంటున్నా.

– పి.జగదీష్, జిల్లా ఎస్పీ

పింఛన్.. ఆనందం పెంచెన్..

- అవ్వాతాతలకు, అభాగ్యులకు నూతన సంవత్సర కానుక
- సామాజిక పింఛను రూ.3 వేలకు పెంపు
- మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- లబ్ధిదారుల్లో వెల్లివిరుస్తున్న సంతోషం

నేటి నుంచి కొత్త పింఛన్ల పంపిణీ ఇలా..

తేదీ	మండలాలు
1	నిడదవోలు అర్బన్
2	నిడదవోలు గ్రామీణ, తాళ్లపూడి, గోకవరం, దేవరపల్లి
3	అనపర్తి, కడియం, సీతానగరం
4	పెరవలి, బిక్కవోలు, చాగల్లు, కొవ్వూరు రూరల్, కొవ్వూరు అర్బన్, రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం అర్బన్, రాజానగరం
5	గోపాలపురం, రంగంపేట
6	కోరుకొండ, నల్లజర్ల, ఉండ్రాజవరం



రాజమహేంద్రవరం 48వ డివిజన్‌లో వాసా వీర సత్యవతికి వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ ప్రత్యూష (ఫైల్)

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వైకల్యంతో బాధపడుతున్నాను.. నాకు పింఛన్ అందజేయండి అంటూ అధికారులకు, స్థానిక నాయకులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది.

– ఓ దివ్యాంగుడి ఆక్రోశం.

నా వయస్సు డెబ్బై ఏళ్లు. నడవలేని స్థితిలో ఉన్నాను. పింఛనుకు అర్హురాలినే. దయచేసి ఇప్పించి, ఆదుకోండి.. అని వేడుకున్నా.. అధికారులకు చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నా కనికరం చూపలేదు.

– ఓ వృద్ధురాలి ఆవేదన.

భర్త చనిపోయి, పిల్లల్ని పోషించుకోలేని దీనావస్థలో.. పుట్టెడు దుఃఖంలో ఉన్నాను. కనీసం పింఛన్ వస్తే కొంత వరకూ ఆర్థిక భరోసా ఉంటుందనుకుని దరఖాస్తు చేసుకున్నాను. అయినా వితంతు పింఛన్ ఇవ్వలేదు.

– ఓ వితంతు మహిళ కన్నీటి వేదన.

2014–19 మధ్య సాగిన టీడీపీ పాలనలో ఎక్కడ చూసినా ఇటువంటి కన్నీటి గాథలే కనిపించేవి. ఎవ్వరిని కదిపినా ఇటువంటి బాధలే వినిపించేవి. అర్హులైనప్పటికీ ఎంతో మంది అభాగ్యులకు, అవ్వాతాతలకు.. టీడీపీకి ఓటు వేయలేదనే కోపంతో జన్మభూమి కమిటీ నాయకులు వారికి పింఛన్లు అందనివ్వకుండా అడ్డం పడ్డారు. గత్యంతరం లేక.. పింఛన్లు అందక ఎంతో మంది అభాగ్యులు వేదనాభరిత హృదయాలతో భారంగా కాలం గడిపేవారు.

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆ పరిస్థితి మారింది. రాష్ట్రంలోని అవ్వాతాతలు, నిర్భాగ్యుల పింఛన్ కష్టాలు గట్టెక్కాయి. అర్హత ఉంటే చాలు.. పింఛన్ అందేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అర్హులందరికీ న్యాయం చేసింది.

ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చుతూ ప్రజాభిమానాన్ని చూరగొంటున్నారు. 2019 మే 30న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులు, డయాలసిస్ రోగుల పింఛన్లను పెంచుతూ తొలి సంతకం చేసి, పెద్దల ఆశీర్వచనాలు తీసుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ జనరంజక పాలన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇచ్చిన మాట తప్పకుండా పింఛను మొత్తాన్ని పెంచుతూ నూతన సంవత్సర కానుకను సీఎం జగన్ అందజేశారు. కొత్త సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 10 వేల మందికి కొత్త పెన్షన్లు అందజేయడంతో పాటు ఇప్పటి వరకూ రూ.2,750గా ఉన్న పింఛను మొత్తాన్ని రూ.3,000కు పెంచారు. అంతేకాకుండా ఏడాదికి రెండుసార్లు అర్హులైన వారికి కొత్త వారికి వైఎస్సార్ పింఛను కానుక మంజూరు చేస్తున్నారు. ఈవిధంగా జిల్లాలో 3,262 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. దీనిపై పింఛన్‌దార్లతో పాటు వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

కొత్తగా మంజూరు చేసిన పింఛన్ల వివరాలు

వృద్ధాప్య: 1,452	వితంతు: 1,459
దివ్యాంగ: 1,022	థర్డ్ జెండర్: 1
ఒంటరి మహిళ: 28	

ఇవీ పింఛన్ల విశేషాలు

- వృద్ధాప్య, చేనేత కార్మిక, వితంతు, కల్లుగీత, ట్రాన్స్‌జెండర్లు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, సంప్రదాయ చర్మకారులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోంది.
- అన్ని రకాల పింఛన్లూ కలిపి గత నెల వరకూ జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 2,44,840 మంది.
- కొత్తగా మంజూరు చేస్తున్న 3,962 పింఛన్లతో కలిపి వీరి సంఖ్య 2,48,702కు చేరింది.
- పింఛను మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచడం ద్వారా వీరికి ప్రతి నెలా రూ.72,66,42,000 పంపిణీ చేయనున్నారు.

మేలు మరువలేం



ఇంటికి వచ్చి పింఛన్ అందించడమే కాకుండా మా యోగక్షేమాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు. ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు నుంచి రూ.3 వేల పింఛను అందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మాలాంటి వారి బాధలు తెలిసిన వ్యక్తి సీఎంగా ఉండటం మా అదృష్టం.

– మునకల కొండమ్మ, రాజమహేంద్రవరం

ప్రజాప్రతినిధుల సమక్షంలో..

వైఎస్సార్ పింఛను కానుకను ప్రభుత్వం ఈ నెల నుంచి మరో రూ.250 పెంచింది. లబ్ధిదారులకు మొత్తం రూ.3 వేలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. జిల్లాలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ నెల 1 నుంచి ఆరో తేదీ వరకూ నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

న్యూస్‌రీల్

3న సీఎం జగన్ రాక



కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3వ తేదీన కాకినాడ వస్తున్నారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నివాసం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి, 9.35 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 9.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 10.20 గంటలకు చేరుకుంటారు. 10.20 నుంచి 10.30 గంటల వరకూ ప్రజలతో ఇంటరాక్ట్ అవుతారు. అక్కడి నుంచి 10.30 గంటలకు రోడ్డు మార్గంలో కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసే బహిరంగ సభకు బయలుదేరుతారు. 10.40 గంటలకు అక్కడకు చేరుకుంటారు. 10.40 నుంచి 11.55 గంటల వరకూ సభా కార్యక్రమాల అనంతరం వైఎస్సార్ పింఛన్ కానుకను విడుదల చేస్తారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు బయలుదేరుతారు. మధ్యాహ్నం 12 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని, మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్థానిక నాయకులతో ఇంటరాక్ట్ అవుతారు. 1.05 గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లికి తిరుగు ప్రయాణమవుతారు.

నేటి స్పందన రద్దు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా ఈ సోమవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయం గమనించాలని కోరారు.

స్వప్నం.. త్వరలో సాకారం..

- మోరంపూడి ఫ్లై ఓవర్‌పై ఎంపీ భరత్‌రామ్
- గడ్డర్లు ప్రారంభం



మోరంపూడి ఫ్లై ఓవర్ వంతెన గడ్డర్లను ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: నగర ప్రజలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల ప్రజల చిరకాల స్వప్నంగా ఉన్న మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఈ వంతెన నిర్మాణంలో అత్యంత కీలకమైన గడ్డర్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇదొక అపూర్వ ఘట్టమని, నగర చరిత్రలో ఇది ప్రధాన నిర్మాణంగా నిలిచిపోతుందని అన్నారు. మోరంపూడి సెంటర్ విశాఖపట్నం – విజయవాడ నగరాల మధ్య, నగరంలోను కీలకమైనదని, దేశంలోనే పెద్ద జంక్షన్ అని చెప్పారు. ఇక్కడ లెక్క లేనన్ని ప్రమాదాలు జరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఇకపై ఎటువంటి ప్రమాదాలూ జరగకూడదనే ఉద్దేశంతోనే ఈ వంతెన నిర్మాణం అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని, పార్లమెంటులో ప్రస్తావించి, ఒక విధంగా కేంద్రంతో కొట్లాడి సాధించానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ మంజూరైన ఫ్లై ఓవర్ వంతెన నాటి ప్రజాప్రతినిధుల అశ్రద్ధతో రద్దయ్యిందని చెప్పారు. గోదావరిపై గామన్ బ్రిడ్జి నిర్మాణంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ కొవ్వూరు – గుండుగొలను మధ్య మళ్లుతుందని.. ఇక రావులపాలెం వైపు పెద్దగా సమస్య ఉండదని అధికారులు నిర్ధారణకు వచ్చి ఈ ఫ్లై ఓవర్‌ను రద్దు చేశారన్నారు. అప్పట్లో ఎన్‌డీఏలో భాగస్వామి అయిన టీడీపీ నేతలు దీనిపై ఎందుకు పోరాడలేదని ఎంపీ భరత్ సూటిగా ప్రశ్నించారు. కొన్ని వందల ప్రాణాలు పోవడానికి పరోక్షంగా టీడీపీ నిర్లక్ష్యమే కారణమని, ఆ ప్రాణాలకు మూల్యం చెల్లించగలరా అని ప్రశ్నించారు. తామే శాంక్షన్ చేయించామని బీరాలు పలికే టీడీపీ నేతలకు రద్దయిన ఫ్లై ఓవర్‌ను తిరిగి మంజూరు చేయించడం ఎంత కష్టమో తెలియదా అని నిలదీశారు. త్వరలోనే లాలా చెరువు, దివాన్ చెరువు, బొమ్మూరు, వేమగిరి, ఓఎన్‌జీసీ ఫ్యూచర్ కిడ్స్ ప్రాంతాల్లో కూడా ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయించి, ఎన్నికల్లోగా వాటికి కూడా శంకుస్థాపన చేస్తామని స్పష్టం చేశారు. మోరంపూడి ఫ్లై ఓవర్ మార్చి మొదటి వారంలో ప్రారంభానికి నోచుకోవచ్చని ఎంపీ భరత్ అన్నారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఏ పనైనా సాధించి, పూర్తయ్యే వరకూ విశ్రమించని నాయకుడు ఎంపీ భరత్ అని కొనియాడారు. కార్యక్రమంలో సృష్టి కాంట్రాక్టు ప్రైవేటు లిమిటెడ్ డీజీఎం రామకృష్ణ, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌గౌడ్, ప్రాజెక్ట్ కంట్రోలర్ చెన్నకేశవ, పార్టీ నాయకులు బర్రే కొండబాబు, నక్కా శ్రీనగేష్, గేడి అన్నపూర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదు రైల్వే స్టేషన్లకు ఐఎస్‌ఓ గుర్తింపు

కాకినాడ: జిల్లాలోని ఐదు రైల్వే స్టేషన్లకు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఐఎస్‌ఓ) గుర్తింపు లభించింది. జిల్లాలో 12 రైల్వే స్టేషన్లు ఉండగా కాకినాడ టౌన్, పోర్టు, సామర్లకోట, అన్నవరం, తుని స్టేషన్లకు ఈ గుర్తింపు దక్కింది. విజయవాడలో శుక్రవారం జరిగిన సమావేశంలో డివిజనల్ రైల్వే మేనేజర్ వీరేంద్ర పాటిల్ ఆయా స్టేషన్ల మేనేజర్లకు ఐఎస్‌ఓ అవార్డులు అందజేశారు. మెరుగైన సిగ్నలింగ్, టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ నిర్వహణ, రైల్వే స్టేషన్ల ఆవరణను పచ్చదనం, స్వచ్ఛతతో తీర్చిదిద్దడం, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఐఎస్‌ఓకు ఎంపిక చేశారు. తమకు ఈ అవార్డులు దక్కడం సంతోషంగా ఉందని కాకినాడ టౌన్, పోర్టు రైల్వే స్టేషన్ల మేనేజర్లు కె.రాధాకృష్ణ, పీవీ సాహూ చెప్పారు.

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీస్సులు, ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

క్లుప్తంగా

కుమార్‌బాబుకు నంది అవార్డు


రావణబ్రహ్మ వేషధారణలో కుమార్‌బాబు

శంఖవరం: కత్తిపూడికి చెందిన వైఎస్ కుమార్ బాబు విశ్రాంత ఉపాధ్యాయుడు కాగా, నాటకాలపై ఆసక్తితో ప్రతి నాయకుడు రావణబ్రహ్మ పాత్ర పోషించి నంది అవార్డు సాధించారు. ఇటీవల గుంటూరులో ప్రభుత్వం నిర్వహించిన 2022 నంది నాటకోత్సవాల్లో సీతా కల్యాణం (పద్య నాటకం) నాటకంలో కుమార్‌బాబు రావణుడి పాత్ర పోషించారు. దీంతో మంచి గుర్తింపు రావడంతో పాటు నంది అవార్డు సాధించారు. ప్రభుత్వం కళాకారులను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. కుమార్‌బాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

సైసై జోడెడ్లా బండి


పోటీల్లో జోరుగా పరుగెడుతున్న ఎడ్లు

- రసవత్తరంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు
- సందడిగా రంగంపేట మండల పరిసరాలు

రంగంపేట: జోడెడ్ల బండ్లు సైసై అంటూ ముందుకు కదిలాయి.. నువ్వా నేనా అనేట్టు పరుగెత్తాయి.. రంగంపేట మండలం వడిశలేరు గ్రామ సమీపంలోని గన్ని వ్యవసాయ క్షేత్రం వద్ద ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఇందులో విజేతలకు రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివంగత ఆదర్శ రైతు గన్ని సత్యనారాయణమూర్తి స్మారకార్థం ఆయన కుమారుడు, రాజానగరం జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సహకారంతో కూటి కోటేశ్వరరావు, బొప్పన బ్రహ్మాజీరావుల నిర్వహణలో ఈ పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 71 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా, సీనియర్స్ విభాగంలో 1,600 మీటర్లలో 14 జతలు, జూనియర్స్ విభాగంలో వెయ్యి మీటర్లలో 57 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలతో వడిశలేరు నుంచి రంగంపేట వరకూ ఏడీబీ రోడ్డు జన సందోహంగా మారింది. గట్టి పోలీసు బందోబస్తు నడుమ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోటీలు ప్రశాంతంగా పోటీలు నిర్వహించారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, షర్మిలారెడ్డి, జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ పోటీలను తిలకించారు.

సంప్రదాయాలను పరిరక్షిద్దాం..

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. పాశ్చాత్య సంస్కృతి ముసుగులో యువత తప్పటడుగులు వేస్తున్న ప్రస్తుత కాలంలో మన గత వైభవానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎడ్లను తీసుకురావడం అభినందనీయమన్నారు. ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో ప్రత్యేక స్థానం

గోదావరి జిల్లాలో ఎడ్ల బండ్ల పరుగు పోటీలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ముఖ్యంగా సంక్రాంతికి సంప్రదాయంగా ఈ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వీటి నిర్వహణకు జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సహకారం అందించడం హర్షణీయమన్నారు. అదేవిధంగా గోదావరి జిల్లా వాసులకు జీఎస్ఎల్ వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు ఎనలేనివన్నారు. జిల్లాను క్యాన్సర్ రహితంగా చేసేందుకు వారి కృషి ప్రశంసనీయమన్నారు.

రైతులను ప్రోత్సహించడానికే..

అంతరించిపోతున్న ఎడ్ల పందేల సంస్కృతిని కాపాడడంలో భాగంగా రైతులకు పోటీల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. విజేతలకు లక్షలాది రూపాయలు బహుమతిగా అందిస్తున్నారని, అదేవిధంగా పోటీలకు వేలాది మంది ప్రజలు విచ్చేయడం బాగుందన్నారు. గన్ని సత్యనారాయణమూర్తి స్మారకార్థం ఈ పోటీలు నిర్వహించారన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఎడ్ల బండ్ల పోటీలు మరిన్ని నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పోటీలు తిలకించడానికి విచ్చేసిన ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలను జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సత్కరించారు. ఎడ్ల బండ్ల ప్రతిమలను బహూకరించారు.

విజేతలు వీరే...

సీనియర్స్ విభాగంలో 14 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతిని గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు గెలుచుకున్నాయి. ద్వితీయ బహుమతిని గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు, గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు, తృతీయ బహుమతిని నరసయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎడ్లు సాధించాయి. జూనియర్స్ విభాగంలో 57 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతి మండపేటకు చెందిన వేగుళ్ల రామస్వామి, ద్వితీయ బహుమతి కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ, తృతీయ బహుమతి వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి ఎడ్లు గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, ద్వితీయ, తృతీయ, అలాగే జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఎలక్ట్రికల్ బైక్‌లు, సీనియర్స్ విభాగంలో మరో ఐదుగురికి, జూనియర్స్ విభాగంలో మరో 5 మందికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. విజేతలకు ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.


ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో సీనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

పేదల సంక్షేమం కోసమే నిర్ణయాలు

ఎంపీ మార్గాని భరత్‌రామ్


విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా పేదల సంక్షేమం కోసమేనని ఆ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'వై నాట్ 175' లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ విజయానికి బాటలు వేస్తున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలో సీఎం జగన్ రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేయించారన్నారు. తాను క్రెడిట్ కోసం వెంపర్లాడే వ్యక్తిని కాదని, తనకు జన్మనిచ్చిన గడ్డ అభివృద్ధి చెందితే చూడాలనే తపన తప్ప మరొకటి లేదని ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ నేతలనుద్దేశించి ఎంపీ భరత్‌రామ్ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి విమర్శలను పలువురు పత్రికా ప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకురాగా, ఆయన తీవ్రంగా స్పందించారు. 'క్రెడిట్ వారినే తీసుకోమనండి.. రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తే అదే చాలు' అని అన్నారు. కేంద్రమే నిధులు మంజూరు చేసిందంటున్నారని, రాష్ట్ర ప్రజలు కడితేనే కదా వారైనా ఇచ్చేదని అని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రతిపక్షాల కామెంట్లు చూశానని.. ఎన్డీఏలో టీడీపీ ఉన్నప్పుడు మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. వందల కొబ్బరి కాయలు కొట్టడం తప్పితే చేసిందేమిటని నిలదీశారు. వారి అసమర్థత, చేతకానితనం వల్ల మోరంపూడి జంక్షన్‌లో కొన్ని వందల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కేంద్రంతో కొట్లాడకపోతే మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి వచ్చేది కాదన్నారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో ఆనందం నిండాలి



హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నానని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, పార్టీ ప్రజాప్రతినిధులకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో మంచి ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రానున్న రోజుల్లో అన్ని వర్గాలకు మరింత మేలు చేకూరుతుందన్నారు.

హ్యాండ్‌బాల్ వర్సిటీ జట్టు ఎంపిక


హ్యాండ్‌బాల్ సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టు

పెదపూడి: విద్యార్థులు క్రీడల్లో మరింత నైపుణ్యం చాటాలని జి.మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి తెలిపారు. ఆ కళాశాలలో రెండ్రోజులుగా జరుగుతున్న ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీస్ హ్యాండ్‌బాల్ క్రీడా పోటీలు, ఎంపికలు ఆదివారంతో ముగిశాయి. యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ అబ్జర్వర్ వర్మ మాట్లాడుతూ ఈ యూనివర్సిటీ పరిధిలోని 8 కళాశాలకు చెందిన మహిళా జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయన్నారు. ఇందులో ప్రథమ స్థానంలో డీఆర్‌కేరెడ్డి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ద్వితీయ స్థానంలో సెయింట్ థెరిస్సా ఏలూరు, తృతీయ స్థానంలో ఎస్ఆర్‌జేసీపీఈ గోపన్నపాలెం, నాల్గో స్థానంలో కాకినాడ ఐడియల్ కళాశాల జట్లు నిలిచాయన్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను యూనివర్సిటీ జట్టుగా ఎంపిక చేశామన్నారు. వీరు త్వరలో జరిగే సౌత్‌జోన్ యూనివర్సిటీ పోటీల్లో ఆదికవి యూనివర్సిటీ తరఫున పాల్గొంటారన్నారు. విజేతలను డీఆర్‌కే రెడ్డి విద్యా సంస్థల అధినేత డీఆర్‌కేరెడ్డి అభినందించారు. స్పోర్ట్స్ బోర్డు చైర్మన్ రామ్‌గోపాల్, డీఎల్ఆర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసారెడ్డి, ఆర్గనైజర్ వెంకట్రావు, పీడీలు సూరారెడ్డి, సత్యనారాయణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అమెరికా నుంచి రేపు స్వస్థలానికి మృతదేహాలు

పిన తండ్రి కుటుంబానికి రాజమహేంద్రవరంలో అంత్యక్రియలు నిర్వహించనున్న ఎమ్మెల్యే సతీష్

అమలాపురం టౌన్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అమలాపురానికి చెందిన టింబర్ వ్యాపారి పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబీకులు ఐదుగురు మృతి చెందగా, ఆ మృతదేహాలను విమానంలో సోమవారం సాయంత్రానికి హైదరాబాద్‌కు తీసుకు రానున్నారు. తర్వాత ఆ మృతదేహాలను అంబులెన్స్‌లో మంగళవారం ఉదయానికి అమలాపురంలోని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఇంటికి తీసుకు వస్తారు. అమెరికా రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పిన తండ్రి నాగేశ్వరరావు దంపతులు, వీరి కుమార్తె, ఇద్దరి మనమళ్లు మృత్యువాత పడటం, వారి అల్లుడు లోకేష్ ఆ దేశంలోని ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతుండడం తెలిసిందే. తన పిన తండ్రి నాగేశ్వరరావు కుటుంబ మృతదేహాలకు రాజమహేంద్రవరంలోని కోటిలింగాల రేవులో మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆదివారం తనను పరామర్శించేందుకు వచ్చిన నాయకులు, బంధువులు, సన్నిహితులకు చెప్పారు. మంగళవారం ఉదయానికి తన ఇంటికి మృతదేహాలు తీసుకువచ్చాక గంట సమయం పాటు ఉంచి అనంతరం అంతిమ యాత్రతో అంత్యక్రియల కోసం రాజమహేంద్రవరం తీసుకు వెళతామని చెప్పారు. అమెరికా ఆసుపత్రిలో లోకేష్‌కు ఇప్పటి వరకూ నాలుగు శస్త్రచికిత్సలు జరిగాయని, ఆయనను కాపాడేందుకు అక్కడి వైద్యులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని తదితర ప్రభుత్వ పెద్దలు శని, ఆదివారాల్లో ఫోన్లు చేసి పరామర్శించారు.

ప్రమాదానికి మైనర్ల డ్రైవింగే కారణం

అమెరికాలో నాగేశ్వరరావు కుటుంబం మృతికి వారి కారును ఢీకొట్టిన టిప్పర్‌ను డ్రైవ్ చేస్తున్న మైనర్లే కారణమని అక్కడి పోలీసులు దర్యాప్తులో తేల్చారని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తెలిపారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి శివారు సత్రం కాలువ సమీపంలో ఆదివారం తేనెటీగల దాడికి గురై అదే గ్రామానికి చెందిన మలిరెడ్డి చిట్టిబాబు (47) మృతి చెందాడు. సాయంత్రం తన పొలంలో పనుల నిమిత్తం వెళుతుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. వెంటనే అతను అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో స్థానికులు సీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు. అలాగే తేనెటీగల దాడిలో తాతబాబు గాయాల పాలయ్యాడు.

అరణ్యకాండ పారాయణఫలం రక్షణ


సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ధనుర్ధారులైన రామలక్ష్మణులను స్మరిస్తే మనకు రక్ష లభిస్తుందని, అరణ్యకాండ పారాయణ ఫలం రక్షణేనని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఆదివారం స్థానిక హిందూ సమాజంలో ఆయన 19వ రోజు ప్రవచనాన్ని కొనసాగించారు. రాక్షస బెడద తొలగిస్తానని రాముడు మునులకు అభయమిస్తాడు. వన సంచారంలో సీతాదేవి రాముని అడుగుతుంది. 'మనకు రాక్షసులతో వైరం లేనప్పుడు వారిని సంహరించడం ఎందుకు? తాపస వృత్తిలో ఉన్న మనం ఆయుధాలు ధరించడం ఎంతవరకు సమంజసం?' అని. అందుకు శ్రీరాముడు బదులిస్తూ 'ఆయుధ ధారులైన క్షత్రియుడు ఉన్న ప్రాంతంలో ఆర్తనాదాలు వినపడ కూడదు. మునుల తపోశక్తిని రాక్షస వధకు వెచ్చించడం వారికి సమ్మతం కాదు. వారికి ఇచ్చిన మాటకోసం నేను జీవితాన్ని, నిన్ను, లక్ష్మణుని సైతం వదలివేయడానికి సిద్ధమే'అన్నాడు. అరణ్యకాండలోని ఈ పదకొండు సర్గలు అత్యంత ప్రాధాన్యమైనవని సామవేదం తెలిపారు. వనవాసంలో ఆయన శరభంగుడు, అత్రి, భరద్వాజుడు, సుతీక్షణుడు మొదలైన మహర్షుల ఆశ్రమాలను సందర్శించాడని, వారు తమ తపోఫలాన్ని ధారపోయడానికి సిద్ధమైనా రాముడు అంగీకరించలేదని, తాను స్వయంగా తపస్సు చేసి తపశ్శక్తిని ఆర్జించుకుంటానని వారికి వినయంగా సమాధానం ఇచ్చాడని సామవేదం వివరించారు.

ఇరువర్గాల ఘర్షణ: వ్యక్తి మృతి


మలకపల్లి చర్చిలో మృతి చెందిన దేశాబత్తుల రమణ (50)

తాళ్లపూడి: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మధ్యలోకి వెళ్లి ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం మలకపల్లిలో చోటుచేసుకుంది. తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ కథనం ప్రకారం.. మలకపల్లి లూథరన్ చర్చిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మధ్యలో పలువురు విడదీయడానికి వెళ్లి ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో దేశాబత్తుల రమణ (50) ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందినట్లు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కొవ్వూరు: ఔరంగబాద్ శివారులో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన మట్టా దేముడు (59) ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో డ్యూటీకి వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మసీదు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతను సమీపంలో పొదల్లో పడిపోయాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న దేముడు కుమారుడు ఆనందరావు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపారు.

సాధారణంగా కొత్త సంవత్సరం వస్తోంది అంటే ఎన్నో సంబరాలు. సంవత్సరంతో పాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ళని, వీధులని, నగరాలని అలంకరిస్తారు. అలంకారాలు, దీపాలు, టపాకాయలు, కొత్తబట్టలు, మిఠాయిలు (ఎక్కువగా కేకు) పంచుకోవటాలు, విందులు, వినోదాలు, శుభాకాంక్షలు. అంటే రాబోయే కాలం ఆనంద దాయకంగా ఉండాలనే ఆకాంక్ష, ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటమే వీటిలోని అసలు అర్థం.

కొత్త సంవత్సరం

మంచి మాట

కొత్త ఆశలు, ఆశయాలు



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి లెక్కించటం కూడా ప్రారంభించాడు. ప్రకృతిలో వస్తున్న మార్పులని పరిశీలించి, తదనుగుణంగా ఉండటం కోసం కాలాన్ని కూడా గణించటం ప్రారంభించాడు. కాలగణనకి ప్రమాణం ప్రకృతిలో జరిగే పరిణామాలే. కొద్దికాలం జరిగిన తరవాత మళ్ళీ ఇంతకు ముందు ఉన్నట్టే ప్రకృతి కనపడితే ఈ క్రమం ఏమిటి? అన్నది అర్థం చేసుకునే ప్రయత్నంలోనే మనిషి కాలాన్ని లెక్కపెట్టటం జరిగింది. లెక్కపెట్టటం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు మొదలుపెట్టాలి. ఒక్కొక్క ప్రాంతం వారు వారికి అనుకూలంగా ఉన్న సమయం నుండి లెక్కపెట్టటం మొదలుపెట్టారు. కాలక్రమంలో దానిలో ఒక హేతుబద్ధతని అవలంబించారు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండే సమయాన్ని కాలాన్ని లెక్కకట్టటానికి మొదలుగా తీసుకున్నారు. పాశ్చాత్యులకి ఆహ్లాదకరంగా ఉండే వసంతం (స్ప్రింగ్) మార్చ్, ఏప్రిల్ నెలలు. మార్చ్ 23 ని సంవత్సర మానానికి ఆదిగా పరిగణించే వారు. తరువాత నెల మధ్యలో ఎందుకని ఏప్రిల్ 1 ని సంవత్సరాదిగా జరుపుకునే వారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జనవరి 1 కి మారింది. మార్చ్ మొదటి నెల కనుక డిసెంబర్ 10 వ నెల, నవంబర్ 9 వ నెల, అక్టోబర్ 8 వ నెల, సెప్టెంబర్ 7 వ నెల అయ్యాయి. ఆ పేర్లే నెలల సంఖ్యని తెలియ చేస్తున్నాయి. ఈ కాలెండర్ ని గ్రెగేరియన్ కాలెండర్ అంటారు. అందరికీ తమ కాలెండర్ ఉన్నా, ఇప్పుడు ప్రపంచం అంతా ఈ కాలెండర్‌నే అనుసరిస్తోంది.

ఈ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తారీకుతో కొత్త సంవత్సరం మొదలు అవుతుంది. సౌరమానాన్ని అనుసరించి ఒక సంవత్సరంలో 365 1/3 రోజులు ఉంటాయి. అందుకని నాలుగు సంవత్సరాలకి ఒక మారు లీప్ ఇయర్ అని ఒక రోజు అధికంగా వస్తుంది. ఆ రోజు తక్కువ రోజులు ఉండే ఫిబ్రవరికి వెడుతుంది.

అయితే ఆనందోత్సాహాలు ఎందుకు? ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు. ఆ విధంగా గడిపే అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు. సంవత్సరంలో మొదటి రోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం. రెండువేల ఇరవై నాలుగవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని ఆనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాము.

> అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్యసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టటానికి నిర్ణయించుకో వలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్తపని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

మనం అందరం కారణజన్ములం. ఏదో ఒక ప్రత్యేకమైన గొప్ప పని చేసేందుకు ఈ భూమిపై జన్మించాం. ఇంత గొప్ప అవకాశం వృథా చేసుకోకండి. ఈ సంవత్సరం ఏదైనా కొత్త, సృజనాత్మకమైన పని మొదలుపెట్టండి. ఏదైనా కొత్త పని చేయకుండా ఏ సంవత్సరమూ గడచిపోకూడదు. మీకు ఏ కలలూ లేకపోతే, వాటిని నిజం చేసుకోలేరు కదా! ఏ కొత్త ఆవిష్కరణ అయినా ఒక కలతో మొదలవుతుంది. ఉన్నతంగా కలలుగనే, ఆలోచించే స్వేచ్ఛని మీకు మీరు ఇచ్చుకోండి. ఆపై, వాటిని సాధించేందుకు నూరుశాతం ధైర్యంతో, సమర్పణభావంతో పనిచేయండి.

ఒక అసాధ్యాన్ని సాధిస్తా!


ఈ భూమిని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా

చాలాసార్లు ఉన్నతమైన కలలు కనేవారిని ఇతరులు అపహాస్యం చేశారు. కానీ వారు వెనక్కు తగ్గకుండా, తమ లక్ష్యాలను సాధించేవరకూ స్థిరంగా నిలబడ్డారు.

మనలో ఉండే ప్రాణశక్తి ప్రవహించేందుకు ఒక దిశను చూపటం అవసరం. దానికి సరైన దిశను చూపకపోతే మీరు గందరగోళంలో చిక్కుకుపోతారు. జీవశక్తి ఒక నిర్దిష్ట దిశలో పయనించేలా చేయాలంటే మనకు నిబద్ధత అవసరం. ఈ రోజున చాలామంది, తమ జీవితానికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం, దిశానిర్దేశం లేకపోవడం చేత అయోమయంలో ఉన్నారు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీ ప్రాణశక్తి తారాస్థాయిలో ఉంటుంది, మరి అంత ఎక్కువగా ఉన్న ఆ ప్రాణశక్తికి, ఎటువెళ్లాలో చెప్పకపోతే, అది అక్కడే చిక్కుకుపోతుంది. ఒకేచోట పేరుకుపోతే ఏమౌతుంది? కుళ్ళిపోయి, పనికి రాకుండా పోతుంది.

ఇక్కడ రహస్యం ఏమిటీ అంటే, మన లక్ష్యం పట్ల నిబద్ధత ఎంత గొప్పగా ఉంటే, దాన్ని సాధించేందుకు అంత గొప్ప శక్తి మనకు లభిస్తుంది. లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే, పనులు అంతా సులభంగా, తేలికగా జరిగిపోతాయి. అదే చిన్న లక్ష్యాలు పెట్టుకున్నారనుకోండి, ఎందుకంటే మీలో సామర్థ్యం కొండంత ఉంది, మీరేమో ఈ చిన్న పనిలో ఇరుక్కుపోయారు అనిపించి మీకే చికాకుగా ఉంటుంది.

మీరు సమాజం బాగు కోసం పనిచేస్తున్నప్పుడు, మీరు పది పనులు చేస్తున్నారనుకుందాం. వాటిలో ఒక పనిలో పొరపాటు జరిగినా, మిగతా తొమ్మిది పనులూ చేస్తూ ఉంటే, ఈ మొదటి పనిలో పొరపాట్లు వాటంతట అవే సర్దుకుంటాయి. సాధారణంగా కృప అనేది ఇలా పనిచేస్తుంది. మొదట అవసరమైన వనరులు సమకూరితే, అప్పుడు పెద్ద లక్ష్యం పెట్టుకుని పని చేద్దామమని మనం సాధారణంగా అనుకుంటాం. కాని, మొదట మీ లక్ష్యం గొప్పగా ఉంటే, వనరులు వాటంతట అవే సమకూరుతాయి. మనం పెట్టుకున్న లక్ష్యమే మనకు ఆ శక్తిని బహుమతిగా ఇస్తుంది. మీరు మీ కుటుంబ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నారనుకోండి, ఆ కుటుంబమే మీకు సహాయం చేస్తుంది. మీరు సమాజం మొత్తానికి గొప్ప పనిచేయాలని సంకల్పించుకుంటే సమాజం మొత్తం మీకు సహాయపడటాన్ని మీరే చూస్తారు. మీకు కావలసిన సహాయం మీరు అడక్కముందే వచ్చి చేరుతుంది.



గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

> మనస్సు పూర్తిగా వర్తమానంలో ఉన్నప్పుడు, మీకు సరైన ఆలోచనలు వస్తాయి. లక్ష్యాలు పెట్టుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సాధించే విధానం కూడా ప్రణాళిక వేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారు? ఒక ఇరవై ఏళ్ల తర్వాత? నలభై ఏళ్ళ తర్వాత? ఫలితం గురించి ఎక్కువ ఆలోచించకుండా మీ విధిని నూరు శాతం నిర్వర్తించండి.

> మీ నిబద్ధతకు ఆశించిన ఫలితం రావాలంటే సరైన ఆలోచనలు, సరైన చర్యలు రెండూ అవసరమే. మీరు సాధించాలనుకుంటున్న అన్ని విషయాలతో పెద్ద చిట్టా తయారు చేసుకోకండి. స్థూలంగా పరిశీలించి, నిజంగా అవసరమైన కొన్ని లక్ష్యాలను ఎంచుకోండి. మనకు అత్యంత సంతృప్తిని ఇచ్చే వాటిని, దీర్ఘకాలంలో పదిమంది జీవితాలను తీర్చిదిద్దే వాటిని ఎంచుకుని పని చేసినపుడు, మగిలిన చిన్నాచితక విషయాలు వాటంతట అవే గాడిలో పడతాయి.

సాధారణంగా మనం మనసులో తపన పడుతూ ఉంటాము, కానీ మన చర్యలు నెమ్మదిగా ఉంటాయి. విజయానికి సోపానం ఏమంటే, మనసులో ఓరిమి, పనిలో ఉత్సాహం. అభిరుచిని, వైరాగ్యాన్ని సరిసమానంగా స్వీకరించండి. మీ లక్ష్యసాధనకై ధైర్యంగా ముందుకు సాగండి, అవసరమైనప్పుడు వదిలేయడం కూడా నేర్చుకోవాలి. అపుడు సహజంగా సమృద్ధి చేకూరుతుంది.

మీరు ధ్యానం చేసినపుడు మీరు సూక్ష్మంగా గమనించగలుగుతారు. మీకు పూర్తిగా విశ్రాంతి లభిస్తుంది, అదే సమయంలో బుద్ధి, వివేచన, సద్యఃస్ఫూర్తి వృద్ధి చెందుతాయి. మీరు ఎఱుకతో ఉండి పనిచేస్తే అది సరైన పని అవుతుంది. చెదిరిపోని దృష్టి, సద్యఃస్ఫూర్తితో పనిచేసే మనసు మీ లక్ష్యాన్ని సాధించేందుకు సహాయ పడతాయి. ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన జీవితానికి, మీరు అనుకున్న లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేసేందుకు సరైన మార్గం ధ్యానం.

నిబద్ధత అనేది దీర్ఘకాలంలో ఎప్పుడూ సుఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా జీవించే అద్భుత ప్రదేశంగా మార్చాలని కంకణం కట్టుకోండి. అసాధ్యమైన కల కనండి!

● ముగ్గు ముచ్చట



26 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



గుంటి శైలజ
మూసాపేట
హైదరాబాద్



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సినిమా



● రజనీకాంత్

కన్యాకుమారిలో వేటగాడు

కన్యాకుమారిలో తిరుగుతున్నాడు వెట్టయాన్ (తెలుగులో 'వేటగాడు' అని అర్థం). రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వెట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా తాజా చిత్రీకరణ కన్యాకుమారి పరిసరాల్లోని లొకేషన్స్‌లో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్, ఫాహద్ ఫాజిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ నటిస్తున్నారని, నకిలీ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. సుభాస్కరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.



● విజయ్

గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్

విజయ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారైంది. విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. న్యూ ఇయర్ (2024) సందర్భంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాకు సంబంధించిన మరో లుక్ నేడు రానుందని కోలీవుడ్ సమాచారం. ఫస్ట్‌లుక్‌ని చూస్తే ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని స్పష్టమవుతోంది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, లైలా, స్నేహ, జయరాం, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదలకానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



● నరేశ్, నాగార్జున, రాజ్‌తరుణ్

మా జోలికొస్తే నా సామిరంగ!

''మా జోలికొస్తే.. మాకడ్డు వస్తే.. మామూలుగా ఉండదు.. నా సామిరంగ..' అంటూ పాడేస్తున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలకానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'నా సామిరంగ..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను కాల భైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'మా జోలికొస్తే మాకడ్డు వస్తే మామూలుగా ఉండదు నా సామిరంగ.., ఈ గీత తొక్కితే మా సేత సిక్కితే మామూలుగా ఉండదు నా సామిరంగ..' అంటూ ఫుల్ జోష్‌లో సాగే ఈ పాటలో నాగార్జునతో కలిసి 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కూడా చిందేశారు. ''మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నా సామిరంగ' రూపొందింది. ప్రధాన తారాగణంతో పాటు 300 మంది డ్యాన్సర్స్‌తో లావిష్‌గా చిత్రీకరించిన 'నా సామిరంగ..' పాటకు దినేష్ మాస్టర్ అందించిన నృత్యాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరధి.



అది మరచిపోలేని జ్ఞాపకం

– శివాత్మిక రాజశేఖర్

''నేను ఎప్పట్నుంచో స్కై డైవింగ్ చేయాలనుకుంటున్నాను. అది 2023లో నెరవేరింది. దుబాయ్‌లో అక్క(శివాని), నేను రెండు వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేశాం. 2023 అనే కాదు.. నా జీవితంలోనే నేను మరచిపోలేని జ్ఞాపకంగా ఈ స్కై డైవింగ్ అడ్వెంచర్‌ను గుర్తు పెట్టుకుంటాను'' అని హీరోయిన్ శివాత్మిక అన్నారు. 2023కి వీడ్కోలు పలుకుతూ 2024కి స్వాగతం పలుకుతున్న శివాత్మిక రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...

■ మీ జీవితంలో 2023 ఎలా గడిచింది?

చెప్పాలంటే... 2023 నాకు గొప్పగా గడిచింది. చాలా విధాలుగా కలిసొచ్చింది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే మంచి ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాననే భావన కలిగింది. ఎప్పట్నుంచో నేను చేయాలనుకుంటున్న పనులు ఈ ఏడాది జరిగాయి. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. నన్ను నేను మెరుగుపరచుకోవడం కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను. కుటుంబం పరంగా కూడా బాగా గడిచింది. దేవుడి దయవల్ల, అదృష్టంగా 2023 నా జీవితంలో సంతోషంగా ముగిసింది.

■ ఈ ఏడాది మీ జీవితంలో జరిగిన చెడు ఘటనలు ఏవైనా ఉన్నాయా?

మంచి జరిగినట్లే... ప్రతి ఏడాది చెడు కూడా ఉంటుంది. అయితే కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టబోయే ఈ తరుణంలో వాటిని నేను గుర్తుతెచ్చుకోవాలనుకోవడం లేదు.

■ కొత్త ఏడాది కోసం మీరు తీసుకున్న కొత్త నిర్ణయాలు ఏంటి?

నా మనసును ఎక్కువగా ఫాలో అవుతూ వర్క్స్ చేస్తాను. ప్రతి అంశం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించేలా జీవిస్తాను. ఇలా గత ఏడాదిలో ప్రయత్నించి సంతోషంగా జీవనం సాగించాను. ఈ ఏడాది కూడా ఇదే ఫాలో అవ్వాలనుకుంటున్నాను.

■ 2024 మీ జీవితంలో ఎలా ఉండాలనుకుంటున్నారు?

పెద్దగా అంచనాలు ఏమీ పెట్టుకోవడం లేదు. ఫ్లోను బట్టి ముందుకెళ్తాను. అయితే అన్నీ మంచి, గొప్ప అంశాలే జరగాలని కోరుకుంటున్నాను. సంతోషంగా, హాయిగా, ఆరోగ్యకరంగా గడవాలని ఆశిస్తున్నాను.

■ కొత్త ఏడాదిని ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?

కొత్త ఏడాది ఎప్పటిలానే అమ్మానాన్న(జీవిత, రాజశేఖర్), అక్క శివానీలతో హైదరాబాద్‌లోనే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలుస్తాను.




● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

యాక్షన్ ఎంటర్‌టైనర్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బీఎస్‌ఎస్ 10'(వర్కింగ్ టైటిల్). 'ఛత్రపతి' మూవీ తర్వాత సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ పూర్తయింది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బీఎస్‌ఎస్ 10'. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు సాగర్ కె.చంద్ర. ఈ సినిమాలోని కీలకమైన షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ చిత్రంలో కొంతమంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.



● మృణాల్ ఠాకూర్



● లారెన్స్

లారెన్స్‌కు జోడీగా..?

హీరో రాఘవా లారెన్స్, హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని టాక్. ఈ చిత్రంలో లారెన్స్‌కు జోడీగా మృణాళ్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను కూడా అనుకుంటున్నారట మేకర్స్. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

దూడుం దుక్కుడుం బాగుంది

– జీవీ ప్రకాశ్ కుమార్



● శ్రీనాథ్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రణవ్, షాజ్ఞ, భువన్ రెడ్డి

''ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143' చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాట బాగుంది. ఈ సాంగ్‌కి క్లాసికల్ టచ్ ఇవ్వడం బాగా నచ్చింది. ఈ సినిమాలోని ఇతర పాటలు ఎలా ఉంటాయో అని ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం తప్పకుండా మ్యూజికల్ హిట్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్ అన్నారు. ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు– 500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో బ్లాక్ యాంట్ పిక్చర్స్‌పై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాటని జీవీ ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. శ్రీ సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నేపథ్య సంగీతం: క్రమాన్.

వాస్తవ ఘటనలతో సర్కారు నౌకరి

ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భావన హీరోయిన్‌గా నటించారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో గంగనమోని శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో 90వ దశకం నేపథ్యంలో 'సర్కారు నౌకరి' రూపొందింది. ఇందులోని సందేశం, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''సర్కారు నౌకరి'లో ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ఆకాష్. ''ఈ మూవీతో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు భావన.



● ఆకాష్, భావన